క్లుప్తంగా

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు వినతి

అశ్వాపురం: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండల పరిధిలోని కల్యాణపురం గ్రామ పంచాయతీలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ మణిదీప్‌కు, ఎల్ఐ మోహన్‌రావుకు గ్రామ పంచాయతీ సర్పంచ్ భూక్యా బుజ్జి ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన నాయకుడు మామిళ్ల రాము, వార్డు సభ్యులు బాణోత్ నాగేష్, చల్లా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జీ.అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఆయుర్వేద సృష్టికర్త భగవాన్ ధన్వంతరి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని సర్పంచ్ కాకా అశోక్ ప్రారంభించారు. శిబిరంలో 195 మంది రోగులకు వైద్యాధికారి అరుణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తౌఫిక్, ఏఎన్ఎం భవాని, నాగమణి, శ్రీనివాస్, రాధిక పాల్గొన్నారు.

ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో..

మణుగూరు రూరల్: మండల పరిధిలోని గనిబోయినగుంపులో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో వైద్యసిబ్బంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనుమానిత వ్యక్తుల నుండి రక్తనమూనాలను సేకరించి, ప్రతీ ఇంట్లో దోమలమందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ అరుణ్‌బాబు, వైద్య సిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించండి

దమ్మపేట : సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సంస్థను ఆదరించాలని సత్తుపల్లి డిపో ఏడీసీ కే.వీ రావు అన్నారు. మండలపరిధిలోని ముష్టిబండ పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ బత్తిన తిరుపతిరావు అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ప్రజలకు అనేక రాయితీలు అందిస్తోందన్నారు. పద్దెనిదేళ్లలోపు విద్యార్థులకు 100 శాతం, దివ్యాంగులకు 50 శాతం సబ్సిడీని ఆర్టీసీ అందిస్తోందన్నారు. ఉపసర్పంచ్ చైతన్య, వార్డు సభ్యుడు చీమల రామారావు, బసవ శ్రీనివాసరావు, అమీరుద్దీన్, మదార్, ఆర్టీసీ సిబ్బంది కిన్నెర, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

మణుగూరు రూరల్: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండలంలోని కూనవరం గ్రామ పంచాయతీ పరిధి కూనవరం, ఎన్టీఆర్ నగర్‌లలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహారావులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. పినపాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, రైతు సంఘం మండల కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, వార్డ్‌మెంబర్ రాజేశ్వరి, నాయకులు ముత్యంబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటమే అసలైన నివాళి

భద్రాచలంఅర్బన్: ప్రజా సమస్యలపై పోరాడటమే అసలైన నివాళని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ నాయకుడు ముదిగొండ నాగేశ్వరరావు వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకునాగేశ్వరరావు స్మారక స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, వై.వెంకటరామారావు, సంతోష్ కుమార్, లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, సీతాలక్ష్మి, జ్యోతి, లక్ష్మికాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు

అన్నపురెడ్డిపల్లి: గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని పార్టీ మండలాధ్యక్షుడు, గుంపెన పీఏసీఎస్ చైర్మన్ బోయినపల్లి సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకా సీత, ఉప సర్పంచ్ నున్న బసవయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానాకు సుస్తీ!

- వంద పడకల ఆస్పత్రిలో అన్నీ సమస్యలే
- అందుబాటులో లేని మందులు
- వైద్యుల కొరతతో అందని మెరుగైన సేవలు



మణుగూరులోని వంద పడకల ప్రభుత్వాస్పత్రి

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మణుగూరులో ఏర్పాటు చేసిన వంద పడకల ఆస్పత్రిలో తీరని సమస్యలు నెలకొంటున్నాయి. మారుమూల గిరిజన పేదలకు అందాల్సిన వైద్య సక్రమంగా అందకపోవడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని అందుకోసమే ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేశామని చెబుతున్నప్పటికీ వాటిలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో పేదలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. స్థానిక ఎమ్మెల్యే సైతం ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు, ఆక్సిజన్ ప్లాంట్ సౌకర్యాలు కల్పించినప్పటికీ ఇక్కడ అనేక సమస్యలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సరిపడా మందులు లేక..

ఆస్పత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా మందులు సరఫరా ఉండటం లేదు. సాధారణంగా వచ్చే వ్యాధులకు సరిపడా మందులు లేకపోవడంతో వైద్యులు బయటకు రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాలు ఆదివాసీ గూడాల్లో నుంచి వచ్చిన వారు బయట కొనుగోలు చేసే స్థోమత లేకపోవడంతో ఆ మందులు వాడలేకపోతున్నారు. దీంతో వారికి రోగాలు తగ్గక పరిస్థితులు మరింత విషమిస్తున్నాయి. కుక్క కాటుతో, కోతి కరిచి ఆస్పత్రికి వచ్చిన వారికి వ్యాక్సిన్లు లేక పోవడంతో వైద్యులు బయట కొనుక్కొని వస్తే వ్యాక్సిన్ వేస్తున్నారు.

వీడని వైద్యుల కొరత..

మణుగూరు వంటి మారుమూల ప్రాంతాల్లో స్పెషలిస్టులు ఇక్కడ పనిచేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో ఇక్కడ వైద్యుల కొరత సైతం కొంత వేధిస్తోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకు సేవలు అందించడానికి ఇక్కడ గైనకాలజిస్టుల అవసరం మరింత ఉంది. ఇటీవల ఇద్దరు గైనకాలజిస్టులు వచ్చినప్పటికీ వారికి ప్రభుత్వం ఇచ్చే చాలీచాలని వేతనాలతో వారు ఇక్కడ పనిచేయడం ఇష్టంలేక వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రభుత్వం సరైన వేతనాలు ఇవ్వక పోవడంతో వైద్యులు మారుమూల ప్రాంతాల్లో చేయడానికి సుముఖత చూపటలేదనే విమర్శలు ఉన్నాయి.

అందని వేతనాలు...

ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య ఇతర వైద్య సిబ్బందికి 9 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి జీవనాధారం లేక ఇక్కడ పనిచేస్తున్న చిన్నాచితక ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. తమకు వేతనాలు చెల్లించాలని వచ్చిన అధికారికి ప్రజా ప్రతినిధులకు చెప్పుకున్నా వారి సమస్యకు పరిష్కారం దొరకడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమకు వేతనాలు వెంటనే చెల్లించాలని కాంట్రాక్టు ఉద్యోగులు కొరుతున్నారు.

పర్మనెంట్ వైద్యులను నియమించాలి



ఆస్పత్రిలో పర్మనెంట్ వైద్యుల ఏర్పాటు చేస్తేనే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. ఏజెన్సీలో ఆదివాసీలకు మెరుగైన సేవలు అందించడానికి ఆస్పత్రి ఏర్పాటుచేసినా వైద్యులు లేక ఫలితం ఉండడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి వైద్యులను నియమించేలా స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి.

– సొందె కుటుంబరావు, గిరిజన సంఘం నాయకుడు

మందుల కొరత తీర్చాలి



నిత్యం పేదలు ఎక్కువగా వచ్చి వైద్య సేవలు పొందే మణుగూరు వంద పడకల ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలి. ఈ ప్రాంత ప్రజలు ప్రతీరోజు ఓపీకి వస్తున్న సంఖ్యకు అనుగుణంగా ఎంత మేరకు మందులు కావాలో గుర్తించి సరఫరా చేయాలి. అప్పుడే ఈ ప్రాంత పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది.

– రావులపల్లి రామ్మూర్తి, మాదిగ ఐక్యవేదిక కన్వీనర్

బయట నుంచే ఇంజక్షన్..



ఇటీవల కుక్క కరవడంతో ఆస్పత్రికి వెళ్తే ఇంజక్షన్ లేదని చెప్పారు. దీంతో బయట నుంచి తెచ్చుకుని వ్యాక్సిన్ వేయించుకున్నాను. దివ్యాంగుడినైన నేను బయటకు వెళ్లి ఇంజక్షన్ తెచ్చుకోవడానికి పడిన ఇబ్బంది అంతా ఇంతా కాదు. ఇప్పటికైనా ప్రభుత్వ ఇలాంటి లేకుండా సరిపడా మందులను ఆస్పత్రిలో అందుబాటులో ఉంచాలి.

– కృష్ణ, మణుగూరు

క్రీడలతో మానసికోల్లాసం


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

ములకలపల్లి : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని, వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందించేందుకు ఆటలు ఎంతగానో దోహదపడుతాయని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని యర్రప్పగుంపు గ్రామంలో కొమరం భీం, సోయం గంగులు జ్ఞాపకార్థం నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీలు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే వెంట టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, సీతాయిగూడెం సర్పంచ్ కారం సుధీర్, పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. కాగా ద్వితీయ బహుమతి రూ.5 వేలను వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం విజేతలకు అందజేశారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి సోయం వీరభద్రం, మండల కన్వీనర్ కందుకూరి రాంబాబు, యువజన విభాగం మండలాధ్యక్షుడు తాటి రమణ, క్రీడా నిర్వాహకులు దుబ్బా నర్సింహారావు, చేపా జోగారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాల అభివృద్ధికి సింగరేణి కృషి


పనులు పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు

మణుగూరుటౌన్: పరిసర ప్రాంతాల అభివృద్ధికి సింగరేణి కృషి చేస్తుందని ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మణుగూరు ఏరియాలోని సింగరేణి సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. సింగరేణి సామాజిక బాధ్యతలో భాగంగా పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు రేగా కాంతారావు ప్రతిపాదనల మేరకు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ ఆదేశాలతో ఈ నిధులు సద్వినియోగం చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని రామానుజవరం, సమితిసింగారం, పంచాయతీల పరిధిలోని పెండింగ్‌లో పనులను పరిశీలించడం జరుగుతుందన్నారు. పరిసర ప్రాంతాలు గ్రామాల అభివృద్ధికి సింగరేణి పెద్ద ఎత్తున పాటు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ రమేష్, ఫైనాన్స్ మేనేజర్ అనురాధ, సీనియర్ ఎస్టేట్ అధికారి బాబుల్‌రాజ్, శ్రావణ్‌లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: ఈ ఏడాది నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతలు, వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాల దృష్ట్యా భద్రాచలంలో శుక్రవారం స్థానిక అగ్నిమాపక అధికారి జి.శ్రీనివాస్, సిబ్బంది పలు హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జీలలో తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, బహుళ అంతస్తు భవనాలకు ఉండాల్సిన అగ్నిమాపక పరికరాలు వాటిని ఉపయోగించే విధానం గురించి ఫైర్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ వివరించారు.

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేడు(శనివారం) అశ్వారావుపేట మండలంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి పర్యటిస్తారని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీపీ స్థానిక అధికారులతో కలిసి మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పాఠశాల భవనాలను మంత్రి ప్రారంభిస్తారన్నారు. నారంవారిగూడెం గ్రామంలో గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అశ్వారావుపేట సొసైటీ చైర్మన్ నూతక్కి నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య, ఏఈఈ కృష్ణ, కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ తనుజా

చంద్రుగొండ: మండలంలోని గుర్రాయిగూడెం గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ కాక సీత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకం తనుజా మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. డాక్టర్ రఘునంద సాయిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ ఇమాం, రేఖన, నీలిమ, సుజాత, రాధ, అనుమాల హనుమంతరావు, శీలం సీతారామిరెడ్డి, రామారావు,రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

భద్రాచలంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వెనుకబడిన గిరిజన కొండారెడ్డి గ్రామాల్లో 200 మంది విద్యార్థులకు శుక్రవారం స్కూల్ యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్సీఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా.ఎస్ఎల్ కాంతారావు, సర్పంచ్‌లు యట్ల మహేశ్వర్‌రెడ్డి, ఉమ్మల దుర్గ, కె.రవి, కె.బాబు, బి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర్య రాజన్ సూచన మేరకు శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కొండరెడ్డి విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు అందించారు. మండలంలోనిపలు గ్రామాల్లోగల దాదాపు 200 మంది కొండరెడ్డి, ఇతర విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాట్ల మహేశ్వరరెడ్డి, ఐఆర్‌సీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, దుర్గ, రవి, పవన్, బాబు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి కృషి చేద్దాం..


అన్నపురెడ్డిపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి: క్షయ రహిత సమాజం కోసం కృషి చేద్దామని మండల వైద్యాధికారిణి డా.ప్రియాంక పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రగుంట పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు క్షయ వ్యాధి నిర్మూలన పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: క్షయ వ్యాధి నివారణే లక్ష్యమని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పీహెచ్‌సీ వైద్యులు రాందాస్ కోరారు. మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి వద్ద శుక్రవారం 'టీబీ ముక్త భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. దాంట్లో భాగంగా పీహెచ్‌సీ మహిళా అంతా కలిసి టీబీ ముక్త భారత్ నినాదంతో రంగవల్లులు వేశారు. అశ్వారావుపేట బీసీ బాలికల గురుకుల పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, వైద్య సిబ్బంది శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, రాజు, సత్యనారాయణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: ముగ్గులు వేస్తున్న వైద్య సిబ్బంది

జాతీయ పెన్షనర్స్‌డే వేడుకలు


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

దమ్మపేట: జాతీయ పెన్షనర్స్‌డే వేడుకలను మండలకేంద్రంలో శుక్రవారంఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు పాల్గొని డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జున్ రావు, సర్పంచ్ ఉయ్యాల చిన్న వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ దారా యుగంధర్, దమ్మపేట టౌన్ అధ్యక్షుడు యార్లగడ్డ బాబు, అత్యం శేఖర్, పానుగంటి చిట్టిబాబు, నందం, అబ్దుల్ జిన్నా, బెక్కం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు


పూజలు చేస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీవీ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏరియా జీఎం దంపతులు రాంచందర్–సుమతిలు స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. డాక్టర్ శేషగిరిరావు దంపతులు, లక్ష్మీపతిగౌడ్ దంపతులు, పిచ్చేశ్వరరావు, కార్మికులు, కుటుంబ సభ్యులు, భక్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బూత్ కమిటీల సమావేశాలు

భద్రాచలంఅర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో బూత్ కమిటీల నిర్వహణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పార్టీ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి బూత్ కమిటీ నిర్వహణ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ పట్టణ కార్యవర్గ సభ్యులు బల్లా సాయి కుమార్, బత్తుల నర్సింహులు, పందా సత్యానంద్, కొలిపాక శివ, రాయల రాములు, నాగరాజు, ఖాదర్, ఖంభం మధు, శ్రీ రాములు, ఉషారాణి, రామకృష్ణ, నాగమ్మ, ఫ్రాన్సిస్ తదితరులు ఉన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం


మాట్లాడుతున్న కొండా చరణ్

చర్ల: మండలంలోని కొరెగడ్డ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా చర్ల మండల కార్యదర్శి కొండా చరణ్ ప్రకటించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు లంకా వెంకట్ అధ్యక్షతన జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి కొరెగడ్డ భూములను నమ్ముకొని సాగు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న పేద రైతుల బతుకులను సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ పేరుతో ప్రభుత్వం ఛిద్రం చేస్తోందని, నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొండా కౌశిక్ అంద్రెయ్య, శివ పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు రిలే దీక్షలు..

చర్లలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం నుంచి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో రిలేనిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏళ్ల తరబడి చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాల ప్రజలు అగ్ని ప్రమాదాలతో తీవ్రంగా నష్టపోతున్నారని ఈ క్రమంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంతగా మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ దీక్షలను విజయవంతం చేయాలానారను.

'తెల్లం'కు నాయకుల పరామర్శ

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ తెల్లం వెంకట్రావును దుమ్ముగూడెం మండల యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోడి చంటి, మాజీ సర్పంచ్ కణితి సమయ్యలు శుక్రవారం పరామర్శించారు. ఈ మేరకు ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

ఇష్టానుసారంగా వ్యర్థాలు పారేస్తే చర్యలు


వ్యాపారస్తులకు సూచనలిస్తున్న కమిషనర్

మణుగూరు రూరల్ : చికెన్, మటన్ వ్యాపారస్తులు కోళ్లు, మేకల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా పారవేస్తే కఠిన చర్యలు తప్పవని మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో చికెన్, మటన్ వ్యాపారస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. హైద్రాబాద్‌లో బాలుడిపై కుక్కల దాడి జరిగిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించిందన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌కు చికెన్, మటన్ వ్యాపారస్తులు, ప్రజలు, జంతు ప్రేమికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



మండలంలోని అబ్బుగూడెం - రాజాపురం గ్రామాల మధ్య రహదారిపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఎలాంటి రక్షణ గోడలు నిర్మించలేదు. దీనికి తోడు గత వర్షాకాలంలో వంతెనలో కొంత భాగం దెబ్బతిని ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేయించి రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

- అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : లక్మానాయక్, ఏఈ, ఆర్అండ్‌బీ
సెల్ నంబర్ :9866309579